క్లుప్తంగా

శివ స్వాముల ప్రత్యేక పూజలు



ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 24 రోజులుగా శివ మాలధారులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో మండల కేంద్రం, మన్నాపురం గ్రామ శివ మాలధారులు మొత్తం 90 మందికి దశరథం బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు బోయ మల్లి, దర్శెల్లి, శివ స్వాములు సీతారాములు, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధవారం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

అలంపూర్: రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ ఆమోదించాలని ఎమ్మెల్యే అబ్రహంను ఆ సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వాల్మీకి బోయలు అధికసంఖ్యలో తరలివచ్చారు. వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.

ఘనంగా మడివేల మాచి జయంతి



అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శివ భక్తుడైన మడివేల మాచి జయంతిని బుధవారం రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి అభిషేకం చేసి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, తిమ్మప్ప, నరసింహులు, తిరుమలేష్, కర్రెప్ప, వీరేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ గోవిందు, ఏఈ చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతునట్లు పేర్కొన్నారు. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపి వేస్తామని రైతులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన



ధరూరు: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జెన్‌కో డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రవిలు తెలిపారు. జనవరి 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీహర్షారెడ్డి(9వ తరగతి), 600 మీటర్ల పరుగు పందెంలో వినూత్న(8వ తరగతి)లు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థుల ఎంపికపై పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెన్‌కో ఎస్ఈ, డీఈలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌యూటీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శులు శ్రీనివాసరావు, మైనోద్దీన్, ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు గుంతలమయం

- ప్రమాదాలబారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బిజ్వారం -అమరవాయి గ్రామాల మధ్య గుంతలమయంగా రోడ్డు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. బిజ్వారం-సంగాల, మల్దకల్-మద్దెలబండ, సద్దలోనిపల్లి-నేతువానిపల్లి, తాటికుంట-తప్పెట్లమొర్సు- పాల్వాయి- తూంకుంట, ఎల్కూరు-మల్దకల్, నాగర్‌దొడ్డి స్టేజీ-తూంకుంట, దాసరపల్లి-నేతువానిపల్లి గ్రామాల మధ్యన ఉన్న బీటీ రహదారులపై పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. ఈ రహదారులు పదేళ్ల కిందట నిర్మించారు. భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో రోడ్లు దెబ్బతిన్నాయి. రాత్రివేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈవిషయమై పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవలే రోడ్డుకు అటు ఇటు పొలాలు ఉన్న రైతులు రోడ్డును అడ్డంగా తవ్వి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవడంతో గుంతలు ఎక్కడ పడితే కనిపిస్తున్నాయి. రోడ్లపై తవ్విన గుంతలను రైతులు పూర్తిస్థాయిలో పూడ్చివేయకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. తవ్విన రోడ్లను మరమ్మతు చేయాల్సిన అధికారులు వాటిపై తాత్కాలికంగా అక్కడక్కడ మట్టిని వేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదాలబారిన పడినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతు చేయించి ప్రమాదాల బారి నుంచి వాహనదారులను కాపాడాలి.

– వెంకటేష్, సద్దలోనిపల్లి

చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ గ్రామాలో రహదారులపై ఏర్పాడిన గుంతలు పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించాం. నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైన వెంటనే రోడ్లకు మరమ్మతు చేపడతాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

అందరి భాగస్వామ్యంతో పల్లెల ప్రగతి



తక్కశిలలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: అందరి భాగస్వామ్యంతో పల్లెల ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. బుధవారం మండలంలోని తక్కశిలలో రూ.70 లక్షల 50 వేల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. త్వరలో డి. బూడిదపాడు నుంచి మారమునగాల గ్రామానికి డబుల్ రోడ్డును, ఇటిక్యాలపాడు నుంచి తక్కశీల గ్రామానికి మిగిలిన రోడ్డును మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచు మద్దమ్మ, ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, టీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు అజయ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్ రెడ్డి, సర్పంచు రేఖ, మండల కోఆప్షన్ మెంబర్ చిన్న బీస్ మియ్యా, ఎంపీటీసీలు సుంకన్న, కురుమూర్తి, బీఆర్ఎస్ నాయకులు నీలం గౌడ్, నరసింహ, రమణ, వెంకటేష్ గౌడ్, లింగారెడ్డి, కృష్ణ గౌడ్, మధుసూదన్ రెడ్డి, పుల్లారెడ్డి, మల్లికార్జున, సీపీఐ నాయకులు రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి ఆలయ పనులను గట్టు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాసు హనుమంతు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం కోసం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో డీలర్ జంగిలప్ప, కృష్ణ, భగవంతు, ఆంజనేయులు, పల్లయ్య, జయప్ప, ఆంజనేయులు, గంగమ్మ, నర్సింహులు, లక్ష్మయ్య, మునెప్ప, యూత్ సభ్యులు జగదీష్, జనార్దన్, వెంకటేష్, కిష్టప్ప, రాజు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా 2016లో ఇండ్ల నిర్మాణం పనులను ప్రారంభించిన ప్రభుత్వం 2.28 లక్షల ఇండ్లను నిర్మించాల్సి ఉండగా 2021 వరకు టెండర్లు పిలిచి కేవలం 1.18 ఇండ్లను మాత్రమే నిర్మించిందన్నారు. పనులలో నాణ్యత లోపించడం వల్ల నిర్మించిన ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్మించిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్నారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, రాంబాబు, రామారావు, విజయ్, రామకృష్ణ, రవికిరణ్, రాజేష్, భాష, దుబ్బన్న, తదితరులు ఉన్నారు.

వేగవంతంగా భూముల రిజిస్ట్రేషన్

మల్దకల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నట్లు తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు మీ సేవలో భూ రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారందరికి రిజిస్ట్రేషన్లు చేసి మ్యూటేషన్ పత్రాలు అందజేశారు. దళారులను ఆశ్రయించొద్దని కొనుగోలుదారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, ఆర్ఐ రామకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ప్రభుత్వం పంపిణీ చేసున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీటీసీ ఎల్లస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వారు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణ, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పాలు, పప్పు, బాలమృతం అందిస్తుందని తెలిపారు. అర్హులందరికీ పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిషోర్, అంగన్‌వాడీ టీచర్ మంజులారాని, మహిళాసంఘం నాయకురాళ్లు అనురాధ, రైమాబేగం, ఆశావర్కర్స్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చండి



మాట్లాడుతున్న గోవిందు

ధరూరు: ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకమైన పనులు చేపడతామని చెప్పి నేటికీ నాలుగేళ్లు గడుస్తున్నా గ్రామ పంచాయతీలపై దృష్టి సారించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ఇస్తామన్న నజరానాలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలో ఏకగ్రీవమైన నాగర్‌దొడ్డి, ద్యాగదొడ్డి, కోతులగిద్ద, బూరెడ్డిపల్లి, పారుచర్ల, ఓబులోనిపల్లి, మన్నాపురం గ్రామ పంచాయతీలకు నేటికీ ఒక్క పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. పంచాయతీలకు నిధులు కేటాయించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పరుశరాముడు, మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మండల నాయకులు జగదీష్, కృష్ణ, దరెప్ప, చిన్న నర్సింహులు, చిన్న సవారన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలు బాధ్యతలు స్వీకరణ




రాజోళి, అలంపూర్ ఎస్ఐలు కుర్మయ్య, మహేందర్

అలంపూర్: అలంపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా మహేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీహరి సాధారణ బదిలీల్లో భాగంగా మంగళవారం వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీహరితో పాటు, కోదండాపురం స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్స్ మహేష్ యాదవ్, పృధ్వీరాజ్‌లను స్థానికులు శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాజోళి: ఎస్ఐగా సీహెచ్ కుర్మయ్య బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎస్ఐ లెనిన్ జడ్చర్లకు బదిలీ అయ్యారు. ఎస్ఐ కుర్మయ్య గద్వాల నుంచి మండల కేంద్రానికి బదిలీ అయ్యారు.

దిమ్మెను నిర్మించండి



రాజోళి: ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెలు పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరినా అధికారుల పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండంలంలోని చాలా గ్రామాల్లో ఏళ్ల కిందట నిర్మించిన దిమ్మెలపై ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని, దిమ్మెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని వాపోయారు. మండలంలోని తుమ్మిళ్ల గ్రామంతో పాటు పచ్చర్ల, తదితర గ్రామాల్లో కూడా మరమ్మతుకు నోచుకోని దిమ్మెలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



మాజీ మంత్రి చిన్నారెడ్డి, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, గట్టయ్య, పాల్గొన్నారు.

పెబ్బేరు: రంగాపూర్‌లోని చింతల వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ధ్వజస్తంభ, నవగ్రహాలు, బొడ్రాళ్లు, గండదీప ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గరుడపూజ, ధనుర్లగ్న శుభపుష్కరాంషమున, మహాయంత్రం స్థాపన, బొడ్రాళ్ల ప్రతిష్ఠ, ద్వార పాలక, నవగ్రహ, గణపతి, గరుడ, బలిపీఠ, నాగ, గండ దీప కార్యక్రమం నిర్వహించారు. కుంభ నివేదనం, పూర్ణాహుతి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య మేళతాలతో బొడ్రాళ్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి,

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



పుల్లూరులో టీకా వేస్తున్న పశువైద్యాధికారులు



పులికల్‌లో టీకాలు వేస్తున్న సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామాల్లో బుధవారం పశువులకు బ్రుసెల్లోసిస్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు, సంవర్థక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణకు వేస్తున్న టీకాలను పాడి పశువులకు వేయించాలని యజమానులకు సూచించారు. మొత్తం 37 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు శిరీషా, సతీష్, సిబ్బంది శివ, మసూమన్న, ఉస్మాన్ బాషా, బీమ్మన్న, లోకేశ్ రెడ్డి పాల్గొన్నారు.

అయిజ: బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా దూడలకు రోగ నిరోధక టీకాలు వేయించాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూపారాణి కోరారు. బుధవారం మండలంలోని పులికల్, సింధనూరు గ్రామాల్లో ఆడ దూడలకు టీకాలు వేశారు. ఈ నెల 8వ తేదీ వరకు 4 నుంచి 8 నెలల వయసున్న దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు వైద్యురాలు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది ఎల్ఎస్ఏ గిడ్డయ్య, వీఏలు సుధాకర్, భాస్కర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అన్యాయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న మణికుమార్

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో వ్యవసాయేతర రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని వ్యవసాయ రంగానికి తక్కువ బడ్జెట్‌ను కేటాయించడం అన్యాయమని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని జింకలపల్లి గ్రామాన్ని నాయకులతో కలిసి ఆయన సందర్శించి రైతులు, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీఎస్పీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు రాంబాబు, ఉపేందర్, బీసన్న, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత

మానవపాడు: మండల కేంద్రంలో మహిళ శిశు సంక్షేమ శాఖ చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, సెల్‌ఫోన్ వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రతపై బుధవారం సీడీపీఓ సుజాత అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడికి వెళ్లని వారి వివరాలను 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన బాలికలకు మాత్రమే వివాహాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీమ్ మెంబర్లు కృష్ణ, కౌన్సిలర్ నవీన్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు స్పందన



అయిజలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



మానవపాడులోని చంద్రశేఖర్‌నగర్‌లో..

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందని డాక్టర్ సౌజన్య, ఆప్తామాలజిస్ట్ రియాజ్‌లు అన్నారు. బుధవారం 132 మందికి కంటి పరీక్షలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాటా ఎంట్రీ ఆపరేటర్ ఎర్రన్న, సూపర్‌వైజర్ హిర్యానాయక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని 3వ వార్డులో బుధవారం రెండో విడుత కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది వార్డు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోడు అందజేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారి పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గిత్తల దేవరాజు, శేక్షావలి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో బుధవారం ఎంపీడీఓ రమణారావు కంటివెలుగు కార్యక్రమంను పరిశీలించారు. కంటివెలుగు డేటాను పరిశీలించి సూచనలను చేశారు. మండలంలోని మానవపాడు, జల్లాపురం, బోరవెల్లి, నారాయణపురం, చంద్రశేఖర్‌నగర్, మద్దూరు జాతీయ రహదారి గుండా మొక్కలను నాటి వాటి పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున విద్యార్థులు



ముండ్లదిన్నెలో ప్రధాన రోడ్డు పక్కన పాఠశాల

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె ప్రభుత్వ పాఠశాల సమస్యల నిలయంగా మారింది. పాఠశాల ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల సమయంలో పిల్లలు బయటకు పంపించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముండ్లదిన్నె మీదుగా పెద్ద తాండ్రపాడు, అశోక్‌నగర్, రాజోళి, తుమ్మిళ్ల, కొంకల గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులను ఆడుకునేందుకు వీలులేకుండా పోయిందని పలువురు వాపోయారు. విద్యార్థుల భోజన సమయంలో కుక్కలు, పందులు బెడద అధికంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

విద్యతోనే కుల అసమానతలు దూరం



అలంపూర్‌లో డైరీ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కేవీపీఎస్ డైరీని బుధవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ దళితులు, విద్య ద్వారా ఆర్థికంగా ఎదిగితే కుల అసమానతలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, అయ్యప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహా, అబ్దుల్ హక్, వెంకటస్వామి, మౌలాలి, నాగన్న, దేవరాజు, దానేలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రైవేట్‌కు ధీటుగా రాణించాలన్నదే వీజేఆర్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వలంటీర్లు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరు పేపర్లకు అనుగుణంగా ప్రముఖ విద్యా నిపుణులచే స్టడీ మెటీరియల్ రూపొందించినట్లు తెలిపారు. రూ.20లక్షల వ్యయంతో 3,500 ఇంగ్లిష్ మీడియం, 1,500 తెలుగు మీడియం స్టడీ మెటీరియల్ బుక్కులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎం లక్ష్మీదేవి, విద్యార్థులు ఉన్నారు.